# అదృష్టదేవత

".........There is one serious philosophical problem and that is suicide. Judging whether life is or is not worth living amounts to answering the fundamental question of philosophy. All the rest .... comes afterwards"

*– Albert Camus*

పగలంతా ప్రతీక్షణ.
మూడు దినాలుగా నిరీక్షణ.
ఒక్క మనీ ఆర్డరు కోసం.
కాని పోస్టు మనిషి పొలకువ లేదు.
ఒక మానవుడి ఆకలి తీరలేదు.

అయినా కాలం ఆగిపోలేదు, వాయువు స్థంబించలేదు, లోక ప్రవృత్తులకు ఆటంకం కలగలేదు. కాలవ ఒడ్డున మురికివాడ శవయాత్ర డప్పుల మధ్య సాగిపోతూనే ఉన్నది. ఆంజనేయస్వామి గుడి మంటపం మీది పెళ్లి సందడి వినవస్తూనే ఉన్నది. వీధిలో కుక్కలు అదిలించినా మొరుగుతూనే ఉన్నాయి. పక్కవాటా వరండాలోకి దూసుకువచ్చిన రామచిలుక తన పంజరంలోకి మామూలుగానే జొరబడుతున్నది. అయితే ఆ శబ్ద తరంగాలేవీ అతని చెవులకు సోకటం లేదు. అతను స్వగతాల మధ్య విహరిస్తున్నాడు. అవన్నీ స్వకల్పితఘాతాలు. అతను పరాగతాల్లో ఊగిపోతున్నాడు. అవన్నీ పరాభవాగ్ని కీలలు.

❖ ❖ ❖

ఈ లోకంలో మానవుడి జీవిత గమనాన్ని అరాచకం చేయగల శక్తిని ఈ డబ్బుకు ఎవరిచ్చారో తెలియక, భద్రతకూ అభద్రతకూ మధ్య అదృశ్య రేఖను క్షణంలో

నిర్దాక్షిణ్యంగా చెరిపివేయగల రాక్షస ప్రవృత్తి దానికి ఏ ఖగోళం నుండి లభిస్తున్నదో గ్రహించలేక, తన కంత తాత్వికాభినివేశం లేక, ఎవరినీ ఎన్నడూ అప్పుకోసం అర్థించే నేర్పు లేక, ఇప్పటికే మూడుసార్లు తప్పి నెల రోజుల్లో మళ్లీ రానున్న పరీక్షల భూత భయాన్ని ఎదుర్కోలేక, తన స్వగతాల బరువుతో కదలనంటున్న కాల రథాన్ని కదిలించే మనోబలం లేక, పట్టణ వీధుల్లో ప్రోదిచేసుకున్న వివిధ విషాదాల ప్రతి శ్రుతుల్ని పారద్రోలుకోలేక, ఛలనం లేని వెలుగు నివ్వని ఒంటరి దీపస్థంభంలాగా దిగులుతో ముసురుకొస్తున్న చీకటి సంధ్యను తిలకిస్తూ, ఎన్నాళ్లనుండో వెల్లకోసం వేసారుతూ ఊడలమర్రి వలె దృగ్గోచర మవుతున్న తన గది గోడల మధ్య - తన కిష్టమైన పాటను నెమరువేసుకుంటున్నాడు మురళి. భయం భయం బ్రతుకు భయం. భయం బ్రతుకు భయం భయం. స్వీటెస్ట్ సాంగ్స్ ఆర్ దోజ్ ఆఫ్ శాడెస్ట్ థాట్స్. తన కెన్ని గేయాలు వచ్చో - సంఖ్యా రూపంలో వాటి నెప్పుడూ బంధించలేదు. అటునుండి ఇటూ, ఇటునుండి అటూ. స్వగతాల్లో మునక. పరాగతాల్లో తేలుడు. ఎప్పటికీ జబాబు రాని ప్రశ్నలు.

తనకు డబ్బు పంపవలసిన అన్న - తన సహోదరుడు కాదు - సవతి అన్న. తను జాబు రాసిన లక్ష్మయ్య - తన ఎకరా పొలం కౌలుదారుకు ఎన్ని సమస్యలో, మరెన్ని కుబుద్ధులో, పూటకూళ్ల ఇంటి యజమాని గూని లక్ష్మీనారాయణ మధ్యాహ్నం అంతమంది ముందు అన్న మాటలు - "ప్రతి నెలా ఇట్లా అయితే ఎట్లానయ్యా? నేనేమన్నా లక్షాధికారినా? నెలలకు నెలలు బాకీలు పెడ్తుంటే నాకు నడుస్తుందా? చెప్పండి మీరే!"

ఆ విసుగుకు తను భోజనం చేయకుండా నిరసనగా వెనుదిగిరి వచ్చాడు. మరుక్షణమే ఆ గూని బ్రాహ్మడు - బాబూ... బాబూ... అని వెనకనుంచి పిలుస్తున్నా వినిపించుకోలేదు. ఎన్నటికీ పూర్తిగాని బతుకు పుస్తకం ఇది. ఈ పుస్తకపు పుటల్లో అదృష్ట దేవత పాద ముద్రలెక్కడా సాక్షాత్కరించవు.

ఒంటరితనంలోనే తన కొక యోగ విద్య అబ్బింది. ఆ విద్యతో తను పరకాయ ప్రవేశం చేయగలడు. ఏదో ఒకానొక నిశ్శబ్ద రహస్య మందిర ద్వారంలోకి ప్రవేశించగలడు. తనకు మూడు పేర్లు - మురళి ఉరఫ్ వేణు ఎలియాస్ కృష్ణుడు. తనవద్ద మూడు పిల్లంగ్రోవులు. మూడు వేణువులు, మూడు వంశీ నినాదాలు. ఎట్టి క్లేశంలోనైనా, ఎంతటి ఆత్మ శోకంలోనైనా -ఫ్లూట్, ఫ్లూట్, ఫ్లూట్. తన తల్లి దీవించి ఇచ్చిన వరం. చిక్కనవుతున్న చీకటినుంచి, మందగించబోతున్న ఆకలి నుండి, ప్రారబ్ధ విచారాల నుండి, వెన్నాడే ఆత్మ జీవవిషాదాల నుంచీ ఆనందం పురిగొల్పినట్లు, ఆక్రందన మేల్కొల్పినట్లు, భయ

నివారణ ప్రార్థనా శ్లోకం ఆశువుగా స్ఫురించినట్లు, ప్రాణశంఖం పూరించినట్లు ఈ లోకంమీద ఒక తిరస్కార తీర్మానం పారవేసి, తన దుఃఖాన్నే వేణువుగా మలిచి - ఒక అనురాగ పంజరంలోకి ప్రవేశించగలడు. ఆ వేణునాదం -ఒక అంతరంగిక కవితా స్పృహలాగా ఆవేశించి, తన నాడీ మండలంలో తెలియరాని మార్పులు తెచ్చి అంతః స్రవంతిగా రసస్ఫోరకమై, తను దర్శించిన ఏకాంత రహస్య మందిరంలో వేదనా స్రవంతిగా ప్రవహించటం - అతనికి నూతన అనుభూతి కాదు. ఇప్పుడూ అంతే!

ఎద నుండి పాట ఎగతన్నుకు వస్తున్నది. రాగమాలిక అల్లికలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నవి. కాని వెండి పొన్ను పిల్లంగ్రోవిని చీకటిలో స్పృశించలేకపోయాడు. లేచి గుడ్డి లైటునూ, పెద్ద లైటునూ వేశాడు. ఏ పుస్తకాల పొరల్లో బందీగా చిక్కుకున్నదో, భక్తి భాగీరథిని అమ్మ పాటల నుండి ప్రవహింపజేసిన వేణువు. మరణశయ్యమీద అమ్మ అశృజలతప్తమై ఆశీస్సులతో తన చేతి కందిన తుది బహుమానం ఆ వంశీ. ఆమె మరణ దృశ్యం!! గతంలోకి పోలేదు, మళ్ళీ ఆ గరళాన్ని మింగలేదు.

ఎదురుగా బల్లమీద -నెల క్రితం వెంకటాద్రిగారింటినుండి యాదృచ్ఛికంగా తెచ్చిన పుస్తకం. పిలవని అతిథిగా ఏతెంచింది. ఎమిల్ దర్క్ హీం రచించిన విశ్లేషణ గ్రంథం - 'ఆత్మ హత్యలు : ఒక విస్తృత సామాజిక పరిశీలన'.

ఆ రోజూ - ఇదే పరిస్థితి. బితుకుబితుకుమంటూ అప్పుకోసం వెళ్ళాడు. వెంకటాద్రి గారు ఇంట్లోనే ఉన్నారు - "రావయ్యా, మురళీ! ఏమిటి విశేషం? సైకిల్ బెల్‌గూడా వినబడలేదే?"

తను సైకిల్ని ఎప్పుడో అమ్ముకున్నానని, అప్పుడైతే అశ్రునౌక మీద తేలి వచ్చానని చెప్పగలడా?

"మంచి సమయంలో వచ్చావ్! మా ఆవిడ జీడిపప్పు వేసి ఉప్మా చేసింది. సాయిబాబాలాగా గురువారం నాడు విచ్చేశావ్. చాలా సంతోషిస్తుంది?"

పళ్లెం నిండుగా వేడివేడి గోధుమ ఉప్మా - నేతిలో తేలుతున్నట్లు, ఆధరువుగా అల్లం పచ్చడీ, నిమ్మకాయబద్దా. పక్కనే - గ్లాసెడు చిక్కని తియ్యని మజ్జిగ.

తను - అప్పు ప్రస్తావన మరచిపోయాడు.

ఎదురుగా గోడకు తగిలించి సాయిబాబా ఏకాదశసూక్తులు. నిజంగానా? ఈ లోకపు సంక్లిష్ట సమస్యలకు ఈ బాబా సంపూర్ణ సమాధాన మవుతాడని అతడే త్రాత, హర్త, కర్త, అభయదాత అని -ఇన్నన్ని సైన్సు పుస్తకాల్ని నిత్య పఠనం చేస్తూనే, ఈ

వెంకటాద్రిగారు నమ్ముతున్నారా? ఏ విషయాన్నైనా ఒక్క చిరునవ్వుతో 'సాయిలీల' అని తేలిగ్గా విశ్వసించే నిత్యతృప్తుడు నిర్లిప్తుడాయన -అమాయకుడా? అమలిన భక్తుడా? తన కెన్నడూ ఈ లీలలతో పరిచయం లేదా? ఎందుకు లేదు?

తన సుప్తచేతనంలో భద్రంగా ఉన్న పేటిక మూత తెరిస్తే చాలు. పూజలో కూచొన్న అమ్మ, తలార స్నానం చేసి వచ్చిన అమ్మ' బాలకృష్ణుడి పాకులాడే విగ్రహ సుందర చైతన్యం ముందు -అమ్మ, మంత్రతుల్యమైన మౌక్తిక దండంలాగా అమ్మ చేతిలో వేణువు, మార్దవంగా శబ్ద బ్రహ్మ స్తుతితో ప్రారంభమై, నాట్యమాడుతున్న నాదనర్తకి విన్యాసాలతో రాధేశ్యాముడి భజనలు, అష్టపదులు విన్నాడు. ఇద్దరే శ్రోతలు. తనూ, ఆ బాలగోపాలుడు. పాటతోనే అమ్మ తూలిపోయేది. కూలిపోయేది. విగ్రహం ఎదుట ఉన్న వెండి గిన్నెలో నిండు వెన్నెల ముద్దులాంటి వెన్నముద్ద మాయమై, అట్టడుగున ఒక బాలుడి చేతి కొనవేళ్ల ముద్రలు. "అమ్మా, అమ్మా..వెన్నముద్ద...?" "అవును, నాన్నా - కృష్ణుడు మన మొర విన్నాడు"

వెళ్ళేందుకు ఉద్యుక్తుడై లేచి నిలబడ్డాడు. కన్నీళ్లను అదిమి పెట్టి, అమృతం వంటి చల్లతాగిన పిమ్మట గూడా శారీరక ఉష్ణోగ్రత తన అస్థిత్వాన్ని కాల్చుతున్నట్లు, తన సహజ స్థితి మౌనమైనట్లు, ఆ మౌనమే తుది పలుకైనట్లు లేచి నిలబడ్డాడు.

"కూచోవయ్యా, పోవచ్చులే. మురళీ! నీ కొక మాట చెప్పనా? మనసు విప్పి పదిమందితో మాట్లాడటం నేర్చుకో. మొన్న మన సీనియర్ పార్టనర్ ఏమన్నాడో- విన్నావా? 'మూడేళ్ల నుండీ పనిచేస్తున్నాడు. ఒక్క పేపరూ క్లియర్ చెయ్యలేడు. బాలెన్స్‌షీట్ వెయ్యటం చేతగాదు. ఆడిట్‌కు పంపితే వారం రోజుల పని రెండు వారాలకు లాగుతాడు. మీ మాటమీది గౌరవంతో ఏమీ అనలేకున్నాను' - కేంద్రీకరించి పని చెయ్యటం అభ్యసించు, మురళీ! ప్రతిదానికీ అదృష్టం దురదృష్టం అంటూంటావు. వట్టి భ్రమ. అందరితో కలసిమెలసి ఉంటే నీ సందేహాలు పటాపంచలవుతాయ్. ఇంతకీ నువ్వొచ్చిన పని చెప్పకుండా లేచావు. నీ అంతస్సత్వం ఏమిటో తెలీదు. అది తెలుసుకొంటే దురదృష్టం మాట ఎత్తవు"

వెంకటాద్రి గారి ఊరడింపుకు సమాధానం చెప్పలేక - "ఊరికేనండి! తోచక" అన్నాడు. ఆ మాటల వెనక ఇంకో మైక్రో సంభాషణ మనసులో మొదలు తున్నది. "ఈ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ కంపెనీ యజమానులు -రావ్ అండ్ రాయుడమ్మ - ఆర్టికల్స్ విద్యార్థికి ఇవ్వవలసిన నెలసరి భత్యం ఒక్కసారి ఒక్క మొత్తంగా ఏనాడైనా ఇచ్చారా? తను పరీక్షలకు చదివేందుకు సెలవిచ్చారా? ఆడిట్‌కు వెళ్లినప్పుడు ఆ పార్టీల

మీద పడి తేరతిండి తినమనేగా? ఎంత ఏహ్యం?

వెళ్తూ వెళ్తూ - "ఏదైనా పుస్తకం తీసుకుంటానండీ?" అన్నాడు.

"నీ ఇష్టం. అయినా ఈమాటు పరీక్షకు బాగా చదువుతున్నావా? ఎవరితోనైనా పొత్తుపెట్టుకో. క్లాసులకు వెళ్లకపోయినా ఇంటర్ లాగించేయవచ్చు" అన్నాడాయన.

అట్లా చేతికి వచ్చింది - ఆత్మహత్యల పుస్తకం. గదిలో ఆ రాత్రంతా దాంతోనే జాగరణ. ఆ పుస్తకంలో ఒక ఇంగ్లీష్ వ్యాసం కాగితాలూ ఉన్నవి. ఆ పుస్తకం తలగడకింద తాచుపాము. ఆ వ్యాసం చంక కింద నాగుబాము. పూర్తిచేసి గుండెల మీద పరుచుకుని నిద్ర కుపక్రమించాడు. గదినిండా ఏదో విషజ్వర వాసన వ్యాపించినట్లుగా ఉంది. ఏదో దుఃఖస్మృతి. ఏదో రహస్య వేదన. ఈ కలవరంలో అన్ని అశాంతులకు ఒక పరిష్కార వేదిక. ఒక నిష్క్రమణ ద్వార దర్శనం. ఈ చిరగని కాల గ్రంథం తనవంటి నిర్భాగ్యులకు ఒక దీపధారి. ఆ మూగిపుటల్లో - రక్తకణాల్లో వాంఛా కీలికలు అదృశ్యమైపోయిన వ్యక్తికి ఒక గీతావచనం. ఇన్నాళ్లూ బతుకుని బంధించిన మోహన శాప వచనాలను వమ్ముచేయగల ప్రతిశాప మంత్ర వాక్యం ఆ పుస్తక సారాంశం.

స్వప్నంలో తన తల్లి - సంక్షుభిత రూపం కానవచ్చింది. గయ్యాళి గంప అయిన తన మొదటి భార్యను వదిలించుకొని తన తండ్రి ఒక సంగీతం పంతులమ్మని చేరదీశాడట. ఎంతో భావుకుడై ఉండాలి. పంతులమ్మ తన జనని, తన మాతృమూర్తి. ఒక సంగీత నిధి. ఆమెను ఉంచుకున్నాడని లోకం కూసింది. ఆమె మరణ శయ్యమీద -తాళి కట్టిన దృశ్యం, తన తలపై ఓర్మితో తన తండ్రి వేసిన అమృతహస్తం- ఈలోకం చూడలేదు. ఒక కళంకి పుత్రుడిగా తను మిగిలిపోయాడు. మొదటి భార్య కోర్టుకెక్కింది. తండ్రి లెక్కచేయలేదుగాని తల్లి మరణం ఆయనను కుంగదీసింది. కోర్టు వ్యవహారం ఒక కొలిక్కి రాకముందే తన స్వార్జితం నుండి ఒక ఎకరాపొలం తనకు దఖలు చేశాడు. దిగులుతోనే కన్నుమూశాడు. ఇప్పుడందరూ గతించారు. తన సవతి పెత్తల్లి కొడుకూ, తనూ మిగిలారు. ఆ అన్న తన నెప్పుడూ తమ్ముడిగా ప్రేమించలేదు. తన మేనమామ తనను చేరదీయలేదు. ఒంటరిగా పుట్టాడు. ఒంటరిగా పెరిగాడు. వెంకటాద్రిగారికి చెప్పలేదు. రావ్ అండ్ రాయుడమ్మ కంపెనీకి తనింక భారం కానక్కరలేదు. తన ఆధ్యాత్మిక దుఃఖం నుండి, తన అధిభౌతికాల నుండి, తన అధి దైవిక కల్లోలాల నుండి విముక్తి కల్పిస్తానని వాగ్దానం చేస్తున్న ఒక వనదేవత, వెన్నెల రసపెల్లా కప్పుకొని వేరే లోకంలో ఈ విషాదాల అపహాస్యభాజన జీవితం ఉండదని వక్కాణిస్తున్న ఒక వరప్రదాయిని- ఆత్మహత్యా రూపంలో తన కా రాత్రి

సాక్షాత్కరించింది. అయినా ఆమె దర్శనంతోనే మాటల కందని ఒక భయసందేహం, ఒక సందేహ స్వేదం తనను తడిపివేస్తున్నవి. జ్వరకంపన హస్తంతో ఆ పుస్తకాన్ని గుండెమీద నుండి తోసివేశాడు. ఆ గ్రంథపు చిక్కుపుటల్లో దాగి ఉన్న పిల్లంగ్రోవి తుళ్లితూలి చిరుశబ్దంతో భూపతనమైపోవటం -వినబడలేదు - తనకప్పుడు.

❖ ❖ ❖

ఎమిల్ డర్క్ హీమ్ - ఆత్మహత్యను ఒక రహస్య విద్యగా, కళగా భావించలేదు. సామాజిక శాస్త్ర పరిధిలో దాన్ని మూడు వర్గాలుగా విభజించాడు. ఆత్మహత్య చేసుకున్న నిర్భాగ్యుణ్ణి చూడకుండానే, తను జీవించిన సమాజ పరిస్థితులకు అన్వయం చెబితే ఒక సత్యం వెల్లడవుతుంది. వాటిని ఎగోయిస్టిక్, ఎనోమిక్, అల్ట్రుయిస్టిక్ - సత్యాలన్నాడు. తనను ప్రేమించే వాళ్లు లేక, తను ప్రేమించగలిగినవాళ్లు లేక, ఏకాంతజీవులని మనం భ్రమపడే ఒంటరి మనుషులు - ఆత్మహత్య కెప్పుడూ వెనుదీయరన్నాడు. దేశంకోసం ప్రాణాలర్పించేందుకు ముందుకు దూకే సైనికులది వేరొక మార్గం. బ్రతికి చెడి కొత్త పరిస్థితులతో రాజీ పడలేని దుదృష్టవంతుల దిందొక వర్గం.

ఇవిగాక వైద్య శాస్త్రపరమైన ఇంకొక వాదనా ఉంది. ఆ వ్యక్తుల రక్తంలో జన్యువుల పరిశోధనా ఫలితంగా చెప్పిన శాస్త్రం అది. 5 -హెచ్.టి. అనే పదార్థపు కొరత ఉన్న మానవుల మెదడు -ఆత్మహత్యల్ని పురిగొల్పుతుందంటున్నారు. విఖ్యాత రచయిత ఎర్నెస్ట్ హెమింగ్వే, అతని సోదరుడు తండ్రితో సహా కుటుంబ సభ్యులందరు ఆత్మహత్యలకు పాల్పడినవారే. వాళ్లు పేదలు గాదు. అజ్ఞానులు కాదు - ధనికులూ, విజ్ఞానులూ, త్యాగధనులూ, సమాజ శ్రేయస్సును కాంక్షించిన ఉత్తమ మానవులే. మరి, తను, మురళి అనబడే తను, భారత యుద్ధానంతర అశ్వత్థామగా, కురుక్షేత్రంలో అర్జునుడిగా, షేక్సపియర్ హామ్లెట్‌గా, డోస్టొవిస్కీ నవలలో రోడియన్ రాస్కొల్నికావ్‌గా- ఒక కల కోసం, జీవితం పన్నిన ఒక వల కోసం, ఇంకొక సంక్లిష్ట సారాంశంకోసం, మరొక సాయిలీలకోసం, ఒక బాలకృష్ణుడి వెన్నెల వెన్నెముద్ద కోసం వేచి ఉన్నాడు- మళ్లీ ఈ దినం ఆ పుస్తకం తెరిచినప్పుడు. అప్పుడు కనిపించింది - వెండిపొన్ను మెరుపు, మంచం కింద దాగి ఉన్న మురళి. అబగా అందుకున్నాడు - చిర యాత్రికుడి స్వప్నంగా.

గది తలుపులు మూసి ఉన్నాయి. అలివిమాలిన తన్మయత్వంతో పాటనందుకున్నాడు. ఆర్తితో, ఆవేదనతో, సుడులు తిరిగే నిస్సహాయంతో - ఒక కృతయుగ వేద ఘోష, ఒక కలియుగ దుఃఖదేవత, ఒక ప్రణువి, ఒక ప్రణవ నాదం,

ఒక మధుర సంగమం, ఒక మాతృశ్రీ ఆత్మీయ వేదన, ఒక అన్వేషణ, ఒక నిర్వేద పరిధిలో అతిలోక అనుభూతిపర్వం. ఒక గంట? ఒక ఘడియ? ఒక దశాబ్దమా! పాట ఆగలేదు. బయట తలుపుమీద చప్పుడు. గబగబ. దడదడ. "ఏమండీ! ఏమండీ! తలుపు.. తలుపు తీయండి!"

తూలుతూ వెళ్లి గడియ తీశాడు. ఆవలి వరండా నుండి గుడ్డి వెలుగు. పక్క వాటాలో ముసలమ్మతో ఉంటున్న యువతి. అస్పష్టమైన అందం. మార్దవమైన కంఠం. "పూటకూళ్లాయన మీకు భోజనం పంపించాడండీ! అన్నీ చల్లారిపోయినై ఎంతసేపైందని. కుంపటిమీద చారువెచ్చబెట్టాను. ఇదిగో టిఫిన్ కారియర్ - ఇక్కడుంచేదా?" అలిసిపోయిన కళ్లతో వెనుదిరిగిపోయిన ఆమెను గమనించలేదు.

"అమ్మా, అమ్మా! నేనిక చచ్చిపోనమ్మా!" ఒక లీల. ఒక హేల. మర్నాడే అతడు ఆడిట్ పార్టీతో విశాఖ వెళ్లిపోయాడు. వెళ్తూ వెళ్తూ మనీ ఆర్డర్ అందుకునే ఆథరైజేషన్ ఉత్తరం పోస్టుమాస్టర్ గారికి రాసి, ఆ పుస్తకంలో పెట్టి ఆమెకిచ్చాడు. ఆమె పేరు తెలియదు. ఖాళీ వదిలాడు. ఆ పుస్తకం పేరు -ఆత్మహత్యలు - ఒక విస్తృత సామాజిక పరిశీలన : ఎమిల్ డర్ఖీమ్ రచన.

❖ ❖ ❖

వీథిశూల ఉందని ఆ గదిలోకి - అద్దెవాళ్లెవరూ ఆసక్తి చూపేవారు కాదు. కాని ఈ అబ్బాయి రెండేళ్లవుతుంది - దిగాడు. లేత తమలపాకు, పంచిన తల ఎత్తడు. మూసిన తలుపు తీయడు. ఆ వయసులో అంత అనాసక్తి యోగం. మూసినా, తెరిచినా ఆ తలుపు సందుల నుండి నిట్టూర్పు వంటి సంగీతం. ఊర్ధ్వలోకపు కన్నీరో, పన్నీరో కురిసే మురళీ రవం. దాటలేని చీకట్లో, తెల్లారని గమ్యంకోసం ఏ స్నేహ హస్తాల స్పర్శకోసమో, ఏ కాంతిపుంజుపు దర్శనం కొరకో ఆ పాటలు. అవి నేర్పిన గురువులు గాంధర్వులో, నారద తుంబురులో. ఒక్కొక్కప్పుడు వారాల తరబడి నిశ్శబ్దం. మొదట్లో భోజనం కారియర్ ఇంటికి వచ్చేది. ఏ కాలం అయినా తను కుక్కలు ముట్టకుండా కాపాడేది. చలికాలంలో కుంపటిముందు పెట్టి గది తలుపు చప్పుడు కాగానే, సద్దుచేయకుండా కనపడేటట్లు ఉంచేది. తలవంచి, థాంక్సండీ! అంతే అని దాటిపోయేవాడు. ఆ గది ఎప్పుడైనా శుభ్రం చేసుకుంటాడో, లేదో, ఆ పనిమనిషి వారానికొకసారే వస్తుంది. ఆ మనిషికివ్వమని ఒకటి రెండుసార్లు తన చేతికే డబ్బు ఇచ్చేవాడు. బహుశః తనవంటి ఒక అభాగ్యజీవి అయ్యుండాలి - ఇప్పుడా పనిమనిషీ లేదు. పూటకూళ్ల భోజనం డబ్బాలూ లేవు. నిన్న ఎట్లాగో వచ్చింది - అనుకుంటూ

పక్క వాటా శకుంతల ఆ పుస్తకాన్ని చూసింది. పోస్టల్ వారికి ఉత్తరమూ చూచింది. ఆ దస్తూరినే అనుకరిస్తూ ఖాళీ స్థలంలో తన పేరూ పూర్తి చేసి ఉంచింది. గది తాళం చెవి అప్పుడు కిందపడ్డది. అంతవరకూ గమనించలేదు. పంజరం తలుపు విరగగొట్టినా ఆ రామచిలక తనను వదలనట్లే, పక్కనే పెద్ద వాటాలో ఉన్న తన సవతి తల్లీ, పిల్లల పగకూడా వదలటం లేదు. తన పెళ్లి సంబంధాలను చెదరగొట్టేశారు. తన ఆస్తి పంపకాల్ని కోర్టులకెక్కించారు. తన సంగీతం ట్యూషన్ల పిల్లల్ని బెదిరించి పంపేశారు. అమ్మమ్మ గతించినప్పుడు పాడె వద్దకు ఒక్క పురుగూ రాకుండా చేశారు. పై కోర్టు అప్పీలుకు తన వద్ద చిల్లి కానీ లేదు. ఈ వీధి శూల గది అద్దే తన ఏకైక సంపాదన. అదీ - ఈ మురళి మాస్టారు - మూడు నెలల బాకీలో ఉంచాడు. ఈ అద్దె డబ్బులొస్తే ఈసారి ఏ టైపు ఇనిస్టిట్యూట్‌లోనైనా చేరి ఏ చిన్న ఉద్యోగమో సంపాదించి జీవితాన్ని తెల్లార్చగలుగుతుందేమో. తను గడపదాటితే సవతీ తమ్ముళ్లిద్దరూ - ఆ మిగిలిన వస్తువుల్నీ దోచేస్తారు. ఎవరితో మొర పెట్టుకోగలదు?

అట్లా ఏమీ తోచక ఆ పుస్తకాన్ని రెండు మూడు సార్లు తిరగవేసింది. అతను గుర్తుపెట్టిన వాక్యాలన్నీ మరీ మరీ చదివింది. వేదనా రోదసిలో విలాప గీతంలాగ తన బ్రతుకు. ఆ బ్రతుకు రాయదలుచుకున్న తుది వీలునామా నకలు ఆ పుస్తకంలో లభించింది.

❖ ❖ ❖

విశాఖ బండి అరగంట ఆలస్యంగా చేరింది. అప్పటికే చీకటి అలుము కొంటున్నది. వారం దినాల తర్వాత మురళి డూప్లికేటు తాళపు చెవికోసం జేబులు వెతుక్కుంటున్నాడు.

లైట్ వేయగానే తన పుస్తకం, దాని మీద మనీ ఆర్డరు రసీదు, పైన నోట్లు, దానిమీద తాళం కప్ప, ఆవలి వరండా నుండి రామచిలక భయంకరంగా అరుస్తున్నది. తిరిగి తిరిగి ఒక జీవన తాప అపభ్రంశ గీతిక నాలాపిస్తున్నది. సంచీ ఆవలకు విసిరేసి మురళి - ఆమెకు కృతజ్ఞతల నందించటానికి ఒక్క ఉదుటున వెళ్ళాడు. పంజరం - గాలి వానలో ఉయ్యాలవలె ఊగుతున్నది. పక్షి తన విహంగాలతో తన భుజాన్ని తడుతున్నది.

గదిలో ఏదో దొర్లి పడ్డ శబ్దం. భడాలున తలుపు తోసి చూశాడు. ఒక భయానకదృశ్యం.

శకుంతల స్థూలు బల్లను తన్నివేస్తున్నది. ఉరి తాడు నీడ గోడమీద

ఊగులాడుతున్నది. మురళి ఆలస్యం చేయలేదు. స్టూలు బల్ల సరిజేసి అధిరోహించి, ఉరి తాడును తొలగించాడు. ఇద్దరూ నేలమీదికి దొర్లిపోయారు. ఆమె ఉరి ముడిని బలంగా మెడ నుంచి తొలగించాడు. ఆమె భల్లున అతనిమీద వాంతి చేసుకున్నది. మురళి తన షర్టు విప్పి, స్వేద జలంతో, వాంతి మురికితో తడిసిన ఆమె. చీరను విప్పి వేశాడు. ఆ దేహాన్నంతా శుభ్రంగా తుడిచాడు. శకుంతల స్వల్పంగా కదిలింది. నీళ్లు చల్లుతున్నాడు. ఆవేశంతో ఆమె ముఖాన్ని ముద్దులతో నింపుతున్నాడు. ఆమె నగ్న దేహం ఆ సన్నని వెలుగులో - దేవళంలో మెరుగు దిద్దుకుంటున్న దేవతా విగ్రహంలాగా ఉన్నది.

అన్ని పరిధులను దాటి, అన్ని దుఃఖాలను అధిగమించి, లోక బంధాలను అవహేళన చేస్తూ, ఏ చింతా లేని అమృతచింతనల మధ్య, ఒక అద్భుత స్పందనా జలపాతపు తుషార వర్షంలో, మోదశోకాల మైత్రిలో, రెండు విభిన్న సంగీతాల స్వర సమ్మేళనలో, సౌందర్య స్నాతులైన - ప్రకృతి పురుషుల కావ్యానిష్కరణ అది.

శకుంతల కళ్లు తెరిచింది. తన చీరను అందుకోబోయింది. "వద్దు, శకుంతలా! నా దేహంతో నిన్ను కప్పివేశాను. ఇక నిన్నెప్పుడూ విడిచిపోను. నువ్వు నా అదృష్ట దేవతవు" అని మురళి మోగుతున్నది.

రామచిలుక నిశ్శబ్దం వహించింది. నిశ్శబ్దంలో ఎంత గొప్ప మంత్రబలం ఉన్నదో - ఆ నగ్న దేహాల - ఆత్మలకు తెలుసు.

✿ ఆంధ్ర ప్రభ వారపత్రిక : 20 మార్చి '96

"ఋగ్వేద ఉషఃకన్య వధువు
సామవేద నవయౌవన గాయకుడు వరుడు
సప్తపది సవ్వడియే కాలం!"

-మునిపల్లె రాజు- అలసిపోయినవాడి అరణ్యకాలనుండి